# సాక్షి నిజామాబాద్

సోమవారం, 10, జూన్, 2024




### ఆయిల్‌పామ్‌తో లాభాలు

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు.

- 2లో ▸



### సాగర్ ఆధునికీకరణ అంతేనా?

నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ ఆధునికీకరణ కలగానే మిగిలింది. సిమెంట్ లైనింగ్ పనులు ముందుకు సాగడం లేదు.

- 4లో ▸

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.6 /26.5

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ



పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన దువ్వూరి జ్యోతిసమన్విత్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయి జనరల్ క్యాటగిరిలో 833, ఓబీసీ ఎన్‌సీఎల్ క్యాటగిరిలో 121 ర్యాంకు సాధించాడు. పెర్కిట్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దువ్వూరి మహేంద్ర, లక్ష్మీ రాజ్యం దంపతుల కుమారుడు జ్యోతిసమన్విత్ గతంలో విడుదలైన ఈఏపీ సెట్ ఫలితాల్లో ఇంజినీరింగ్ విభాగంలో 144 ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 112 ర్యాంకు సాధించాడు.

### పండిత్‌ల సీనియారిటీ జాబితా విడుదల

నిజామాబాద్ అర్బన్ : జిలా విద్యాశాఖలో భాషా పండితులు, పీఈటీలకు సంబంధించిన పదోన్నతి సీనియారిటీ(అప్‌గ్రేడ్) జాబితాను విడుదల చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10, 11 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు.

### ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి



మోపాల్ : రైతులు ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని మా పల్లె చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, ఇందూరు తిరుమల ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి సూచించారు. మండలంలోని నర్సింగ్‌పల్లిలో మా పల్లె ట్రస్ట్ ఆధ్వర్యంలో పండిస్తున్న దేశీ వరి రకాల ప్రకృతి సేద్య వ్యవసాయ క్షేత్రాన్ని నల్గొండ, మెదక్, వరంగల్‌తోపాటు అమెరికాలో ప్రకృతి సేద్యం చేస్తున్న పలువురు రైతులు ఆదివారం సందర్శించారు. ప్రాచీన కాలం నాటి దేశీ వరి వంగడాలు, పండిస్తున్న విధానం, దిగుబడులు, తదితర అంశాలను నర్సింహారెడ్డి వివరించారు. అంతకుముందు ఇందూరు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదాన్ని అందజేశారు. రైతులు విశ్వేశ్వర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, పంకజ్‌రెడ్డి తదితరులు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. వారి వెంట ఎంపీటీసీ సద్మల రాములు, ఆలయ కమిటీ సభ్యులు నర్సారెడ్డి, రవీందర్ యాదవ్ ఉన్నారు.

### సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి



నిజామాబాద్‌నాగారం : జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని స.హ. చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజులలో అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ స.హ. చట్టం ప్రజలకు వజ్రాయుధం లాంటిదన్నారు. ఆసక్తిగల యువతీ, యువకులు సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీలో సభ్యులుగా చేరొచ్చని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల శేఖర్ పాల్గొన్నారు.

# పసుపు సాగుకే మొగ్గు



- గత సీజన్‌లో మంచి ధర రావడంతో..
- ఎక్కువ విస్తీర్ణంలో సాగుకు రైతుల సన్నాహాలు
- ముందస్తుగా పసుపు విత్తిన పలువురు రైతులు

మోర్తాడ్ : మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన గడ్డం శ్రీనివాస్‌రెడ్డి గత సీజన్‌లో రెండు ఎకరాల్లో పసుపు సాగు చేశాడు. పంటకు మంచి ధర రావడంతో ఈసారి మూడున్నర ఎకరాల్లో సాగుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. నీటి లభ్యత ఉండటంతో తొలకరి పలుకరించకపోయినా పసుపు విత్తడం పూరి చేశాడు. ఇలా జిల్లాలో అనేక మంది రైతులు గతంలో కంటే పసుపు సాగు విస్తీర్ణం పెంచే యోచనలో ఉన్నారు. గడచిన సీజనులో జిల్లాలో 25వేల ఎకరాల్లో పసుపు సాగు అవగా ఈసారి 40 వేల ఎకరాలకు మించి సాగు అయ్యే అవకాశం కనిపిస్తుంది. గత సీజన్‌లో మునుపెన్నడూ లేని విధంగా పసుపు పంటకు క్వింటాలుకు రూ.18వేల వరకు ధర లభించింది. కనిష్ట ధర రూ.10వేలకు తగ్గక పోవడంతో ఈ పంటకు పూర్వ వైభవం సంతరించుకోనుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. గతంలో జిల్లాలో 50వేల ఎకరాల వరకు పసుపు సాగు అవగా ధర లేకపోవడంతో లాభం లేదని రైతులు సాగు విస్తీర్ణం తగ్గిస్తూ వచ్చారు.

### ఉష్ణోగ్రతలు లెక్క చేయకుండా..

పసుపు తవ్వకాలు ముందుగా చేపట్టాలంటే ముందస్తుగానే విత్తడం మేలు అని రైతులు భావిస్తున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నా వర్ష సూచన ఇంకా లేకపోయినా.. రైతులు పసుపు సాగు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. మోర్తాడ్ మండలం దొన్కల్, వేల్పూర్ మండలం కుకునూర్, కోమన్‌పల్లి, వేల్పూర్, అంక్సాపూర్, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, బాల్కొండ, మెండోరా, ముప్కాల్ తదితర మండలాల్లో దాదాపు 4వేల ఎకరాల్లో పసుపు సాగును రైతులు ఆరంభించారు. సాధారణంగా రెండు భారీ వర్షాలు కురిసిన తరువాతనే పసుపు సాగును మొదలు పెడతారు. గత వర్షాకాలం సీజనులో సాధారణం కంటే ఎక్కువ వర్షాపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు పదిలంగా ఉన్నాయి. సాగునీటికి కొరత లేదనే ఉద్దేశంతో వర్షాలు కురువక పోయినా పసుపు విత్తడం పూర్తి చేయడం విశేషం.

### వర్షాలు పడే వరకు ఆగాలి

రెండు, మూడు భారీ వర్షాలు కురువనిదే పసుపు సాగుకు అనుకూలమైన వాతావరణం కాదని శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూమిలో వేడి ఉండటంతో విత్తనం మొలకెత్తడానికి తక్కువ అవకాశం ఉందని, దాంతో నష్టం పెరుగుతుందని చెబుతున్నారు. రైతులు మాత్రం ముందస్తుగా పసుపును సాగు చేస్తే జనవరి ఆరంభంలోనే తవ్వకాలను మొదలు పెట్టవచ్చనే భావనతో పనులు ఆరంభించడానికి మొగ్గు చూపుతున్నారు. కొన్ని గ్రామాల్లో విత్తనం విత్తడం పూర్తి కావడంతో పొరుగు గ్రామాల్లోని రైతులు సైతం సాగుకు ఏర్పాట్లు మొదలు పెట్టారు. సాధారణంగా వర్షాలు కురువక ముందు మొక్కజొన్న మాత్రమే విత్తుతారు. మేలో సజ్జలు, నువ్వుల కోతలు పూర్తి కాగానే రైతులు మొక్కజొన్న పంట సాగుకు ఏర్పాట్లు చేస్తారు.


### సాగు విస్తీర్ణం పెరగనుంది



ఈ సీజన్‌లో పసుపు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. గత సీజనులో ధర ఎక్కువగా లభించడంతో పసుపు సాగుతో లాభాలు ఆర్జించవచ్చు అనే భావనలో రైతులు ఉన్నారు. ఒకటి, రెండు వర్షాలు కురిసిన తర్వాతే పసుపు సాగును ఆరంభించాలి. ఉష్ణోగ్రతలు అధికంగా పెరుగుతున్నాయి. విత్తనం భూమిలో ఉడికిపోతుంది. దీంతో రైతులు నష్టపోతారు. భూమి చల్లబడితేనే విత్తనం మొలకెత్తడానికి అవకాశం ఉంది. రైతులు కొంత ఓపిక పడితే బాగుంటుంది.

– రోహిత్, ఉద్యానవన శాఖ అధికారి

# ఇక ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు





- విద్యాశాఖలో నూతన విధానం
- బోధన, బోధనేతర విభాగాల కోసం ప్రత్యేక యాప్
- పాఠశాలలు ప్రారంభం కాగానే అందుబాటులోకి..

నిజామాబాద్ అర్బన్: విద్యాశాఖలో ఫిర్యాదుల కోసం నూతన విధానం అందుబాటులోకి రానుంది. ఇక ఎలాంటి ఫిర్యాదు అయినా ఆన్‌లైన్‌లో చేయొచ్చు. దీనికి సంబంధించి ప్రత్యేక యాప్ రూపొందించారు. పాఠశాలలు ప్రారంభం కాగానే యాప్ అందుబాటులోకి రానుంది. దీంతో యాప్‌కి సంబంధించిన ప్రాథమిక వివరాలు, ప్రక్రియను సిద్ధం చేసుకోవాలని డీఈవోను రాష్ట్ర అధికారులు ఆదేశించారు. దీనికి అనుగుణంగా జిల్లా విద్యాశాఖ అధికారి సమాచార సేకరణ ప్రక్రియను పూర్తి చేశారు.

**త్వరలో శిక్షణ**

జిల్లాలో 789 ప్రాథమిక పాఠశాలలు, 137 ప్రాథమికోన్నత పాఠశాలలు, 269 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 4,897 ఉపాధ్యాయులు, 167 మంది బోధనేతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరు తమకు ఏమైన సమస్య ఉంటే ఇక యాప్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. బాధితుడి పేరు, ఫోన్ నంబరు, ప్రాంతం, సమస్య యాప్‌లో అప్లోడ్ చేయాలి. తర్వాత ఆ ఫిర్యాదు జిల్లా విద్యాశాఖలోని సంబంధిత అధికారి వద్దకు వెళ్తుంది. ఆయన నిర్దేశించిన సమయంలో బాధితుడికి రిప్లై ఇస్తారు. అతని సమస్యకు పరిష్కారాన్ని చూపిస్తారు. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, ఉద్యోగులు, టీచర్ల వివరాలను సేకరిస్తోంది. దీనిపై త్వరలోనే ఎంఈవోలు, విద్యాశాఖ కార్యాలయం సూపరింటెండెంటలకు శిక్షణ ఇవ్వనున్నారు. జూన్ 25 తర్వాత దీనిని అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో ఫిర్యాదుదారుడు ఎక్కడి నుంచైనా యాప్‌లో సమస్యను తెలిపితే సంబంధిత అధికారులు సమాచారాన్ని వీలైనంత త్వరగా అందించగలుగుతారు. కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పుతుంది. పాఠశాలలో విద్య బోధన, మౌలిక సదుపాయాల కల్పన, టీచర్ల గైర్హాజరు, ఇతర సమస్యలను కూడా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిన తర్వాత శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

### ఆదేశాలు రాగానే..

విద్యాశాఖలో ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల అంశం రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయించారు. యాప్ అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రస్థాయిలో ఈ ప్రక్రియపై కసరత్తు జరుగుతోంది. ఆదేశాలు రాగానే జిల్లాలో అమలు చేస్తాం.

– దుర్గాప్రసాద్, డీఈవో

### గాలివాన బీభత్సం

తాడ్వాయి: మండలంలో శనివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలోని కరడ్‌పల్లి శివారులో రెండు పశువుల రేకుల షెడ్లు కూలిపోగా.. గొల్ల అంజయ్యకు చెందిన ఆవులకు గాయాలయ్యాయి. విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి.



కరడ్‌పల్లి శివారులో కూలిన రేకుల షెడ్డు

# మరమ్మతులు మరిచారు!

- ధ్వంసమైన కాకతీయ, లక్ష్మి కాలువ లైనింగ్
- నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రమాదం
- ఏటా ప్రతిపాదనలు పంపుతున్న అధికారులు
- నిధులు మంజూరు చేయని ప్రభుత్వం



ధ్వంసమైన లక్ష్మి కాలువ లైనింగ్



ధ్వంసమైన కాకతీయ కాలువ లైనింగ్

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు సరఫరా చేసే ప్రధాన కాలువలు అధ్వానంగా మారుతున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. కాకతీయ, లక్ష్మి కాలువల లైనింగ్ ధ్వంసమై నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న పాలకులు పట్టించుకోవడం లేదు. ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీరు అందించడానికి వినియోగించే ప్రధాన కాలువ కాకతీయ. ఈ కాలువ ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాలకు నీరు అందిస్తారు. కానీ కాలువ మరమ్మతులపై పాలకులు నిర్లక్ష్యం వదలడం లేదు. కాకతీయ కాలువ లైనింగ్ మరమ్మతులు 2013–14లో చేపట్టారు. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు చేయలేదు. కాలువ లైనింగ్ పలుచోట్ల దెబ్బతింది. కాలువ జీరో పాయింట్ నుంచి కొద్ది దూరంలోనే లైనింగ్ ధ్వంసమైంది. ప్రస్తుతం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. సకాలంలో వరదలు వచ్చి చేరితే కాలువల ద్వారా ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. కానీ కాలువ పరిస్థితి అధ్వానంగా ఉండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

**నిధులు కరువు**

కాకతీయ కాలువ మరమ్మతుల కోసం ప్రాజెక్ట్ అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపుతున్నారు. కానీ ప్రభుత్వం నుంచి చిల్లీ గవ్వ మంజూరు కావడం లేదు. నీటి విడుదల ప్రారంభం కాకముందే లైనింగ్ ధ్వంసమైన చోట మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**అధ్వానంగా లక్ష్మి కాలువ**

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి జిల్లా రైతాంగానికి లక్ష్మి కాలువ ద్వారా నీరు అందుతుంది. అయితే ఈ కాలువ పరిస్థితి కూడా అధ్వానంగా మారింది. ఓ వైపు 2017లో మంజూరైన నిధులకు సంబంధించిన పనులు సాగుతున్నా ప్రధాన కాలువ గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. కాలువ లైనింగ్ ధ్వంసమై నీటి ప్రవహానికి ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### ప్రతిపాదనలు పంపాం

కాకతీయ కాలువ లైనింగ్ ప్యాచ్ వర్క్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం. లైనింగ్ ధ్వంసం అయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – రఘుపతి, డిప్యూటీ ఈఈ, కాకతీయ కాలువ

# ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్ష

- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, సీపీ

నిజామాబాద్‌అర్బన్ : జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష జరిగింది. గంట ముందుగానే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోకి పంపించారు. బయోమెట్రిక్ హాజరు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 41 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 12,833 మంది అభ్యర్థులకు 9,945 మంది పరీక్ష రాశారు. 77.49 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కాకతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎస్ఆర్ కాలేజీల్లోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తనిఖీ చేశారు. కలెక్టర్ పరీక్షా కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. కాగా అంతకుముందు కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్ నుంచి కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆయా రూట్ల వారీగా ప్రశ్న పత్రాలు, ఇతర సామగ్రిని కేంద్రాలకు తరలించారు. పరీక్ష ముగిసిన అనంతరం ఓఎంఆర్ షీట్లు, ఇతర మెటీరియల్‌ను నిబంధనలకు అనుగుణంగా తిరిగి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈ ప్రక్రియను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పర్యవేక్షించారు. ఆయన పలు పరీక్షా కేంద్రాలను సైతం తనిఖీ చేశారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.

ఖలీల్‌వాడి : గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను సీపీ కల్మేశ్వర్ పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలోకి ఆలస్యంగా వచ్చిన ముగ్గురు అభ్యర్థులను పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు వెనుదిరిగారు.



నగరంలోని ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ కల్మేశ్వర్

# పేరుకే క్రీడా ప్రాంగణాలు

- వసతులు కరువు.. నిర్వహణ అస్తవ్యస్తం
- కిట్ల పంపిణీలో నిర్లక్ష్యం
- ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో మగ్గుతున్న క్రీడా పరికరాలు
- రూ. లక్షల ధనం వృథా

రెంజల్(బోధన్) : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అందుకోసం ఉపాధి హామీ నుంచి రూ. లక్షల నిధులను ఖర్చు చేసింది. వీటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు యువత ఆటలు ఆడేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా యువజన క్రీడల శాఖ ద్వారా మండలాలు, మున్సిపాలిటీల వారిగా 557 కిట్లను పంపిణీ చేసింది. ఒక్కో కిట్‌లో క్రీడా పరికరాలతో పాటు టీషర్టులను సరఫరా చేసింది. కానీ అవి యువత దరి చేరలేదు. క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారగా కిట్లు అటకెక్కాయి.

### బోర్డులకే పరిమితం

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువకులను ఆటల వైపు మళ్లించి వారిని శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారు చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి క్రీడా ప్రాంగణానికి సుమారు రూ. 2.5 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు వెచ్చించారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేని స్థానంలో ప్రభుత్వ పాఠశాలలు, ఖాళీస్థలాలు, పల్లె ప్రకృతి వనాల్లో క్రీడా ప్రాంగణాల బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం అవి అక్కరకురాకుండా పోయాయి. కొన్ని ప్రాంగణాల్లో కేవలం డబుల్, సింగిల్ బార్‌లు ఏర్పాటు చేసి మమ అనిపించుకోగా అనేక గ్రామాల్లో బోర్డులకే పరిమతం చేశారు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణాల్లో సరైన సౌకర్యాలు లేక ఆడుకునే వారు లేక అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. పనికిరాని స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయడంతో అటు వైపు యువత కన్నెత్తి చూడటంలేదు.



వీరన్నగుట్ట తండాలో బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణం

### ఖాళీ స్థలాలే క్రీడా మైదానాలు

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు, కిట్లు నిరుపయోగంగా మారడంతో క్రీడలపై ఆసక్తి కల్గిన యువకులు, విద్యార్థులు ఖాళీ స్థలాలను గుర్తించి మైదానాలుగా మార్చుకుంటున్నారు. పిల్లలకు వేసవి సెలువులు కావడంతో ఇంటి డాబాలు, పాఠశాల ఆవరణలు, రోడ్ల పైనే ఆటలాడుతు కనిపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకు రావాలని యువత కోరుతున్నారు.

### మండలాల వారీగా పంపిణీ చేసిన కిట్లు

ఆర్మూర్ 19, బాల్కొండ 10, జక్రాన్‌పల్లి 25, భీంగల్ 29, కమ్మర్‌పల్లి 12, మెండోరా 12, మోర్తాడ్ 10, ముప్కాల్ 7, నందిపేట్ 34, వేల్పూర్ 20, ఏర్గట్ల 9, బోధన్ 39, చందూర్ 5, కోటగిరి 25, మోస్రా 4, రెంజల్ 17, రుద్రూర్ 12, వర్ని 18, ఎడపల్లి 14, ధర్పల్లి 23, డిచ్‌పల్లి 39, ఇందల్వాయి 15, మాక్లూర్ 43, ముప్కాల్ 14, నవీపేట్ 35, నిజామాబాద్ 10, సిరికొండ 27.

**మున్సిపాలిటీలలో..**

ఆర్మూర్ 5, భీమ్‌గల్ 2, బోధన్ 3, నిజామాబాద్ కార్పొరేషన్ 20.

### క్రీడాకారుల్లో నిరుత్సాహం

జిల్లాలోని ప్రతి మండలానికి జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో అందించిన కిట్లను నాటి అధికారులు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అప్పగించారు. యువత వినియోగించాల్సిన కిట్లు ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో మగ్గుతున్నాయి. గ్రామాల్లోని క్రీడాకారులు, యువతను గుర్తించి అందించాల్సిన కిట్లు నాయకుల ఇళ్లల్లో పనికిరాకుండా ఉన్నాయి. అధికారులు ఆదరబాదరగా కిట్లను పంపిణీ చేసి చేతులు దులుపుకోడంతో గ్రామాల్లోని క్రీడాకారులు నిరుత్సాహపడుతున్నారు. యువతను క్రీడల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించినా అక్కరకు రాకుండా పోయాయి.



వీరన్నగుట్ట హైస్కూల్‌లో నిరుపయోగంగా ఉన్న క్రీడా పరికరాలు

### కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..

మండల అధికారులు అందించిన నివేదిక ప్రకారం క్రీడా ప్రాంగణాలు ఉన్న మండలాలకు కిట్లను అందించాం. మండల పరిషత్ అధికారులకు కిట్లను సరఫరా చేశాం. కిట్లు అటకెక్కిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాను. కిట్లను వినియోగంలోకి తీసుకు రావాల్సిన బాధ్యత మండల పరిషత్ ఆధీనంలో ఉంటుంది.

– ముత్తెన్న, జిల్లా యువజన, క్రీడల అధికారి

## క్లుప్తంగా

### ఐఐటీ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో కాకతీయ హవా



నిజామాబాద్‌అర్బన్‌: ఐఐటీ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో కాకతీయ విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ,రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన మిన్హాజ్‌ ఆలిండియాలో 438 ర్యాంకు, ఎ తేజ్వసిని 856, ఎం సుప్రీత్‌ 3407, జె కీర్తన 3740, సిద్ధార్థ 4906, ఎ హడి 5102 ఆలిండియాలో ర్యాంకులు సాధించారు. వీరు 2024లో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడమే కాక ఐఐటీ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో కూడా ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు ఐఐటీ మెయిన్స్‌ 2024లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్‌ రామోజీరావు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. కళాశాలలో ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసి విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యా బోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు జిల్లా స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

### ప్రచార ఆర్భాటాలేనా..?

నిజామాబాద్‌అర్బన్‌: ఐఐటీ, నీట్‌ ప్రత్యేక శిక్షణ అంటూ జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేటు కళాశాలలు ప్రచార ఆర్భాటాలే తప్ప ఫలితాల్లో సత్తా చూపలేకపోతున్నాయి. ఆదివారం వెలువడిన ఐఐటీ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో కొన్ని కళాశాలలు ర్యాంకులు సాధించలేక పోయాయి. ఇతర రాష్ట్రాల్లో వచ్చిన ర్యాంకులను ప్రచారం చేసుకుంటున్నాయి. ఇతర రాష్ట్రాల ర్యాంకులు కళాశాలకు వచ్చాయంటూ ప్రచార బోర్డులు పెట్టి ఫీజుల పేరిట రూ. లక్షలు వసూలు చేస్తున్నాయి. ఇలా తప్పుడు ప్రచారాలతో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ఇలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్‌ చేస్తున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలోని కొన్ని కళాశాలు ఐఐటీ నీట్‌ పేరిట ర్యాంకులు సాధించామంటు బోర్డులు పెట్టి ప్రచారం చేస్తున్నాయి. ఇంటర్‌లో ర్యాంకులు సాధించిన పలు కళాశాలు ఐఐటీ, నీట్‌ ఇతర పోటీ పరీక్షల్లో వెనుకంజ వేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెతున్నాయి.

### పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని రాజీవ్‌ గాంధీ ఆడిటోరియంలో జిల్లా పద్మశాలి మహిళా సంఘం, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వధూవరుల పరిచయ వేదికను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దీకొండ యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పెండ్లి సంబంధాల కోసం సంఘ సభ్యులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రహించి పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, పరిచయ వేదిక చైర్మన్‌ గుజ్జ రాజేశ్వరి, రాపెల్లి గురుచరణ్‌, పుల్గం హనుమాండ్లు, అవదూత దశరథం, గుడ్ల భూమేశ్వర్‌, చింతల గంగాదాస్‌, గుడ్ల చంద్రబాగ, బింగి మోహన్‌, బండి నరహరి, గుజ్జేటి వెంకటనర్సయ్య, డాక్టర్‌ బొద్దుల రాజేంద్రప్రసాద్‌, మెరుగు నాగరాజు, గంట్యాల వెంకట్‌ నర్సయ్య, దాసరి గుండయ్య, నల్ల నారాయణ, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్‌తో లాభాలు

- జిల్లాలో సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఉద్యాన శాఖ



ఆర్మూర్‌ ప్రాంతంలో సాగవుతున్న ఆయిల్‌ పామ్‌ తోట

ఆర్మూర్‌: వ్యవసాయ కూలీల కొరత, ఆర్థిక భారం, వ్యవసాయ యాంత్రీకరణతో పెట్టుబడి వ్యయం పెరిగి ఇక్కట్లు పడుతున్న రైతాంగం ప్రత్యామ్నాయ పంటలవైపు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ వ్యయం, తక్కువ శ్రమతో ఎక్కువ లాభం పొందవచ్చని రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కల్పిస్తుండటంతో జిల్లా రైతాంగం ఆయిల్‌ పామ్‌ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. 2024–25 సంవత్సరానికి ఆయిల్‌ పామ్‌ సాగు కోసం ఉద్యానవన శాఖ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆయిల్‌ పామ్‌ను భారతీయ వంట నూనెల మిషన్‌, ఉద్యాన శాఖ ద్వారా నిర్వహిస్తూ నిజామాబాద్‌ జిల్లాలో 2022 నుంచి ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,897 మంది రైతులు 4,637 ఎకరాల్లో ఆయిల్‌ పామ్‌ తోటలు సాగు చేస్తున్నారు.

**రైతులకు ప్రోత్సాహం**

ఉద్యాన శాఖ నిజామాబాద్‌, నిర్మల్‌, సిరిసిల్ల, ఆదిలాబాద్‌ జిల్లాలను ఆయిల్‌ పామ్‌ జోన్‌గా గుర్తించింది. జిల్లాలోని పంటలను ప్రినియ్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ కంపెనీ వారు రైతులకి అందుబాటులో ఆర్మూర్‌ మండలం చేపూర్‌లో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకాన్ని నిర్వహిస్తున్నారు. పంట దిగుబడిని సైతం వీరే కొనుగోలు చేస్తారు. దేశవ్యాప్తంగా వంట నూనెలో 70 శాతం వాటా ఆయిల్‌ పామ్‌కు ఉండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌ పామ్‌ సాగుకు ప్రోత్సహకాలు అందిస్తున్నాయి. డ్రిప్‌పై సబ్సిడీ అందిస్తున్నారు. ఎరువులు, అంతర పంటకి పెట్టుబడి సాయం కింద ఒక ఎకరానికి రూ. 4,200 చొప్పున నాలుగేళ్ల పాటు అందించనున్నారు.

**ఎకరాకు 50 మొక్కలు**

ఆయిల్‌ పామ్‌ దీర్ఘ కాలిక పంట. మొక్కకు మొక్కకు మధ్య 9 మీటర్ల దూరంలో ఎకరానికి 50 మొక్కలు నాటుకోవచ్చు. మూడేళ్ల పాటు అంతర పంటలుగా పసుపు, సోయాబీన్‌, మొక్కజొన్న, ఎర్రజొన్న, కూరగాయలు, వేరుశనగ, మినుములు, అరిటి, బొప్పాయ, పత్తి లాంటివి సైతం విత్తుకోవచ్చును. నాలుగేళ్లలో ఎకరానికి 175 నుంచి 200 కిలోల ఆయిల్‌ పామ్‌ దిగుబడి వస్తుంది. ఈ పంట కొనుగోలు గ్యారంటీ ఉన్న పంట. ఆయిల్‌ పామ్‌ యాక్ట్‌ 1993 ద్వారా రైతులకి రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కలిపిస్తుంది. రైతులకు అందుబాటులో 10 నుంచి 20 కిలోమీటర్‌ దూరంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కంపెనీ వారు నేరుగా ఆయిల్‌పామ్‌ కొంటారు. 2024 మే నెలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర టన్నుకు రూ.14,229. ఈ ధరకు కేటాయించిన జిల్లాలో ఇప్పటి వరకు 289 టన్నుల ఆయిల్‌ పామ్‌ను కంపెనీ వారు కొనుగోలు చేశారు.

### దరఖాస్తు చేసుకోవాలి

ఆయిల్‌ పామ్‌ పంట పండించడానికి రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి మధుసూదన్‌ తెలిపారు. ఆసక్తి ఉన్న రైతుల తమ సమీపంలో ఉన్న ఉద్యాన శాఖ అధికారిని లేదా కంపెనీ క్లస్టర్‌ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. అదనపు సమాచారం కోసం సంబంధిత అధికారులకు ఫోన్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

| | |
|---|---|
| జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి | 8977713968 |
| మోర్తాడ్‌ ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి | 8977713981 |
| బాల్కొండ ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి | 8977713980 |
| జిల్లా ఆయిల్‌ కంపెనీ ఇన్‌చార్జి | 9154864921 |

# ఎస్సారెస్పీలో పేరుకుపోయిన పూడిక



ఎస్సారెస్పీలో మట్టి దిబ్బలు

- 56 ఏళ్లలో 32 టీఎంసీల పూడిక
- ప్రాజెక్ట్‌ భవిష్యత్తుపై ఆందోళన
- పనిచేయని రివర్స్‌ స్లూయిజ్‌ గేట్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నీటి నిల్వ సామర్థ్యంపై 90 టీఎంసీల నుంచి 80.5 టీఎంసీలకు పడిపోయింది. ప్రాజెక్ట్‌ పూడికపై 1994లో చేపట్టిన సర్వే ఆధారంగానే నీటి లెక్కలను ప్రాజెక్ట్‌ అధికారులు ఇన్నాళ్లు చెపుతు వచ్చారు. ఈ క్రమంలో నీటి లెక్కలను సరిచేయుటకు ప్రాజెక్ట్‌ అధికారులు అనేక తంటాలు పడ్డారు. నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు రాగానే ఎగువ ప్రాంతాల్లో బ్యాక్‌వాటర్‌ నిలిచే ప్రాంతాల్లో పంటలు నీట మునగడం, గ్రామాల్లో నీరు రావడం జరిగింది. దీన్ని కప్పి పుచ్చుకోవడం కోసం అధికారులు తరుచుగా 70 టీఎంసీలకు నీరు చేరుకోగానే వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని వదిలారు. ఉన్నతాధికారుల ఆదేశాలంటూ చేతులు దులుపుకొన్నారు. ఎట్టకేలకు పూడి కప్పై ఉన్నతాధికారులు ధ్రువీకరించడంతో ప్రాజెక్ట్‌ అధికారులకు నీటి లెక్కలు సరిచేసే తంటాలు తప్పాయి.

**ఆందోళనలో ఆయకట్టు రైతులు**

ఎస్సారెస్పీ కింద 18 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ పూడిక పెరిగి పోతుండటంతో ప్రాజెక్ట్‌ భవిష్యత్‌పై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. 1978లో 112 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్ట్‌ నిర్మించారు. 56 ఏళ్లలో 80 టీఎంసీలకు పడిపోయింది. మరో 50 ఏళ్లలో పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదలతో ప్రతి సంవత్సరం 0.8 టీఎంసీల పూడిక వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్‌ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. ప్రాజెక్ట్‌ నుంచి గోదావరిలోకి నీటిని వదిలినప్పుడు కొద్దో గొప్పో పూడిక కిందకు పోవడానికి వరద గేట్ల వద్ద ఆరు రివర్స్‌ స్లూయిజ్‌ గేట్లను నిర్మించారు. కానీ అవి నిర్మించినప్పటి నుంచి ఒక్కసారి కూడా వినియోగించ లేదు. దీంతో పూడిక అలానే పేరుకు పోతుంది. వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని వదిలినప్పుడు, కాలువల ద్వారా నీటిని వదిలినప్పుడు స్వల్పంగా పూడికపోయే అవకాశం ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు అంటున్నారు.

**గతంలోనూ నివేదికలు**

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ సామర్థ్యం 70 టీఎంసీలకు పడిపోయినట్లు గతంలో పలు సర్వే సంస్థలు నివేదికలు ఇచ్చాయి. 1994లో 90 టీఎంసీలకు పడిపోయినట్లు ఏపీఈఆర్‌ఎల్‌ సంస్థ నివేదిక ఇచ్చింది. తర్వాత 2004లో అదే సంస్థ ప్రాజెక్ట్‌ సామర్థ్యం 70 టీఎంసీలకు పడిపోయినట్లు నివేదిక ఇస్తే ప్రాజెక్ట్‌ అధికారులు కొట్టి పారేశారు. 2013–14లో మరో సంస్థ సర్వే చేసి 70 టీఎంసీలకు పడిపోయినట్లు చెప్పిన అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం 80.5 టీఎంసీలకు నిల్వ సామర్థ్యం పడిపోయినట్లు ప్రాజెక్ట్‌ అధికారులతో పాటు ఉన్నత అధికారులు కూడా ధ్రువీకరించారు.

**పలుమార్లు హెచ్చరించిన ‘సాక్షి’**

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంపై ‘సాక్షి’ దినపత్రిక గతంలో పలుమార్లు హెచ్చరించింది. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ 70 టీఎంసీలకు రాగానే వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదలడంపై పలుమార్లు అధికారులను ప్రశ్నిస్తు కథనాలు రాసింది. అధికారులు తమ లెక్కలను సరి చేసుకున్నారు కానీ పూడిక లెక్కలను చూపలేదు. ఎట్టకేలకు సాక్షి చెప్పిందే నిజమైంది.



హాల్‌టికెట్‌ నంబర్‌ సరిచూసుకుంటున్న అభ్యర్థులు



ఒక నిమిషం ఆలస్యంతో పరీక్ష రాసే అవకాశం కోల్పోయిన ఎం శ్వేత

గ్రూప్‌–1 ప్రిలిమినరి పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్షల అధికారులు, పోలీసులు పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నిర్ణీత సమయానికి సెంటర్లకు చేరుకున్న అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత లోనికి అనుమతించారు. ఆలస్యంగా వచ్చిన వారిని పరీక్ష రాసేందుకు అనుమతించలేదు. పలువురు మహిళా అభ్యర్థులు చంటి పిల్లలతో సెంటర్లకు రాగా, వారు పరీక్ష రాసి వచ్చేంత వరకు బంధువులు పిల్లలను ఎత్తుకొని బయట వేచి ఉన్నారు. ఆధార్‌కార్డులు వెంట తీసుకురాకపోవడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు.



సెంటర్‌ బయట చిన్నారులతో అభ్యర్థుల బంధువులు

– కామారెడ్డి క్రైం/కామారెడ్డి అర్బన్‌





గేటు మూసివేయడంతో తమను అనుమతించాలని వేడుకుంటున్న అభ్యర్థులు



అంకాపూర్‌లో పూర్వ విద్యార్థులు



అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న బోర్గాం(పి) జెడ్పీ హైస్కూల్‌ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



ముప్కాల్‌ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు



బోధన్‌లో వంశి స్కూల్‌ విద్యార్థులు..

## అ‘పూర్వ’ సమ్మేళనం

మోపాల్‌/ బాల్కొండ/ పెర్కిట్‌/ రుద్రూర్‌/ ఆర్మూర్‌టౌన్‌/ బోధన్‌టౌన్‌: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని పలు పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నిజామాబాద్‌ నగర శివారులోని బోర్గాం (పి) జెడ్పీ హైస్కూల్‌లో 2003–04కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు స్థానిక మున్నూరు కాపు సంఘంలో అపూర్వ సమ్మేళనం చేపట్టారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ముప్కాల్‌ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు, ఆర్మూర్‌ మండలంలోని అంకాపూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2008–09 పదో తరగతి పూర్వ విద్యార్థులు, పోతంగల్‌ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04కు పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులందరూ ఒకే చోట కలవడం సంతోషం వ్యక్తం చేశారు. ఆర్మూర్‌ పట్టణంలోని విజయ్‌ పబ్లిక్‌ స్కూల్‌లో 1997–98కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు, బోధన్‌ పట్టణంలోని వంశి స్కూల్‌లో 1998–99కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు.



పోతంగల్‌ హైస్కూల్‌లో..



ఆర్మూర్‌లోని విజయ్‌ పబ్లిక్‌ హైస్కూల్‌లో..

## క్రైం కార్నర్‌

# చెరువులో పడి యువకుడి మృతి

మోపాల్‌: చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మంచిప్ప చెరువులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడకు చెందిన విఠల్‌(34)కు ముదక్‌పల్లిలోని పల్లికొండ సాయిలు కుమార్తెతో వివాహమైంది. విఠల్‌ ఇల్లరికం రావడంతో ఇక్కడే ఉంటున్నారు. కొన్ని నెలలు ఇక్కడే ఉండి బాన్సువాడకు వెళ్లిపోయాడు. ఇటీవల ముదక్‌పల్లికి వచ్చి భార్యతో ఉంటున్నాడు. శనివారం సాయంత్రం మంచిప్ప చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఫిట్స్‌ రావడంతో చెరువులో మునిగిపోయాడు. గమనించిన గంగపుత్రులు ఆయన కోసం చెరువులో గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం మధ్యాహ్నం విఠల్‌ మృతదేహం చెరువులో తేలింది. మృతదేహాన్ని కుటుంబీకులు బాన్సువాడకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో ఒకరు..**



కుమార్‌స్వామి (ఫైల్‌)

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన పిట్ల కుమార్‌ స్వామి (28) మెదక్‌ జిల్లా చేగుంట వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అంతంపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుమార్‌స్వామి జంగంపల్లి గ్రామంలో పురుగుల మందులు, విత్తనాలు విక్రయించే డీలర్‌గా పనిచేస్తు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

## ఇసుక లారీల పట్టివేత



బిచ్కుంద(జుక్కల్‌): మండలంలోని గుండెనెమ్లి క్వారీ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను ఎస్సై మోహన్‌రెడ్డి ఆదివారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆరు లారీలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. సీజ్‌ చేసిన లారీలను మైన్స్‌ అధికారులుకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

## పీఎస్‌ ఎదుట బైక్‌ చోరీ

నవీపేట: ఇంట్లో జరిగిన చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితుడి బైక్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ దొంగతనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన మల్లేశ్‌ ఇంట్లో గురువారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని దుండగులు చొరబడి తన జేబులో ఉన్న రూ. 7500 నగదును దొంగిలించి పారిపోతుండగా తేరుకున్న మల్లేశ్‌ ఒక దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. ఈ విషయమై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు శుక్రవారం రాత్రి పీఎస్‌కు తన బైక్‌పై వచ్చాడు. బైక్‌ను పీఎస్‌ ఎదుట పార్కింగ్‌ చేసి లోపలికి వెళ్లాడు. బయటకు వచ్చి చూసే సరికి బైక్‌ కనిపించలేదు. ఇంట్లో జరిగిన చోరీ మరువక ముందే బైక్‌ చోరీకి గురవడంపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

వంతెనను ఢీకొన్న లారీ

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



పెద్దపూల్‌ బ్రిడ్జి కింద పడిపోయిన లారీ



గాయపడ్డ డ్రైవర్‌ షేక్‌ ఇమ్రాన్‌

నిజాంసాగర్‌(జుక్కల్‌): మహమ్మద్‌నగర్‌ మండలంలోని నర్వ గ్రామ శివారులో ఉన్న పెద్దపూల్‌ బ్రిడ్జిని ఓ లారీ ఆదివారం రాత్రి ఢీకొని వాగులో పడిపోయింది. నిజాంసాగర్‌ వైపు నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న లారీ పెద్ద పూల్‌ బ్రిడ్జి బండరాళ్లను ఢీకొనడంతో టైర్లు ఊడిపోయి వాగులో పడిపోయింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ఘటన స్థలానికి చేరుకొని క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ ఇమ్రాన్‌ను బయటకు తీశారు. డ్రైవర్‌ మద్యం మత్తులో ఉన్నాడని స్థానికులు తెలిపారు. అతను తీవ్రంగా గాయపడడంతో 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు**

బోధన్‌రూరల్‌: మండలంలోని అమ్దాపూర్‌ శివారులో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలానికి చెందిన ఇషాక్‌ పాషా కొంత కాలం నుంచి బోధన్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం గ్రూప్‌–1 పరీక్ష రాసి బైక్‌పై ఎల్లారెడ్డికి వెళ్తుండగా అమ్దాపూర్‌ వద్ద నాందేడ్‌కు చెందిన షేక్‌ షాదుల్‌ తన ఎక్సెల్‌ వాహనంతో ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇషాక్‌ పాషాకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**లారీ, కారు ఢీ..**



పిట్లం(జుక్కల్‌): మండలంలోని గద్దగుండు తండా సమీపంలో శనివారం రాత్రి లారీ, కారు ఢీకొనగా పలువురికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌ జిల్లా బోధన్‌కు చెందిన అశ్రఫ్‌ కుటుంబీకులతో కలిసి కారులో హైదరాబాద్‌ నుంచి పిట్లం వైపు వస్తుండగా గద్దగుండు తండా సమీపంలో ఎదురుగా రాంగ్‌ రూట్‌లో వస్తున్న ఇసుక లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో కారులోని బెలూన్స్‌ ఓపెన్‌ కావడంతో కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## బైక్‌ స్వాధీనం

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లి, ఠానాకలాన్‌ గ్రామాల పరిధిలో ప్రధాన రహదారిపై వారం రోజులుగా ఉన్న బైక్‌ను ఎడపల్లి పోలీసులు స్థానికుల సమాచారం మేరకు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ను ఎవరైనా దొంగతనం చేసి వదిలి వెళ్లిపోయారా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి పేర్కొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌

## బంగారు గొలుసు అపహరణ



పిట్లం(జుక్కల్‌): మండల కేంద్రంలోని స్వర్ణకారుల కాలనీలో ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి అపహరించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నస్రుల్లాబాద్‌ మండల కేంద్రానికి చెందిన గడ్డం శకుంతల పిట్లం బస్టాండ్‌లో దిగి పిట్లంలోని తన కూతురు హేమలత ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించారు. ఈ ఘటనకు సంబంధించిన ఆధారాలు, నిందితుల చిత్రాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు బాధితురాలి కుటుంబీకులు తెలిపారు.

## ఒకరి అదృశ్యం

బోధన్‌టౌన్‌: పట్టణంలోని ఆచన్‌పల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్‌(25) అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వీరయ్య ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆచన్‌పల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్‌ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబీకులు తెలిపారు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రవీణ్‌కుమార్‌ భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.